సాక్షి
శ్రీకాకుళం
గురువారం। 4। జూలై। 2024



పోషకాలు మెండు

మార్కెట్‌లో నేరేడు పండ్లు విరివిగా లభిస్తున్నాయి. ధర కాస్త ఎక్కువే ఉన్నా వీటిని తింటే ఆరోగ్యానికి మంచిదని వైద్యులు చెబుతున్నారు. - 8లో



కన్నవారికి కడుపుకోత

ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో యువకుడు మృతి చెందాడు. దీంతో పెద్ద తామరాపల్లిలో విషాదఛాయలు అలముకున్నాయి. - 8లో

11న కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ

కోటబొమ్మాళి : క్రోధి నామ సంవత్సర ఆషాఢ మాసం సందర్భంగా ఈ నెల 11న కొత్తమ్మ తల్లిని పలు రకాల కూరగాయలతో శాకంబరీదేవిగా అలంకరించి భక్తులకు ప్రత్యేక దర్శనం కల్పిస్తున్నట్లు ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు తరలివచ్చి ఆశీర్వాదాలు పొందాలని కోరారు.

మళ్లీ వచ్చేశారు..

ఇసుకాసురులు





కరజాడలో అక్రమంగా డంప్ చేసిన ఇసుక

● జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో..

శ్రీకాకుళం నియోజకవర్గ పరిధిలోని శ్రీకాకుళం మండలం పొన్నాం, బట్టేరు, కరజాడ, నైరా, భైరీ, కిల్లిపాలెం, కల్లేపల్లి ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణా అధికంగా జరుగుతోంది. గార మండలం అంబళ్లవలస, బూరవిల్లి ప్రాంతంలో తవ్వకాలు సాగిస్తున్నారు. శ్రీకాకుళానికి ఆనుకుని ఉన్న మొదలవలస, ముద్దాడలో కూడా ఇసుక దందా నడుస్తోంది. రెండు రోజులు ఏకధాటిగా తవ్వకాలు జరిపి, మూడు రోజులు బ్రేక్ ఇచ్చి మళ్లీ తవ్వకాలు జరిపి అక్రమంగా తరలిస్తున్నారు. నదిలో నుంచి ట్రాక్టర్లతో ఖాళీ ప్రదేశాలకు తీసుకెళ్లి డంప్ చేస్తున్నారు. తవ్వకాలు నిలిపేసిన మూడు రోజుల వ్యవధిలో స్టాక్ చేసిన ఇసుకను విక్రయిస్తున్నారు. టీడీపీ ప్రధాన నాయకులే కర్త, కర్మ, క్రియ. ఒక్కొక్క లారీకి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క చోట 100కిపైగా లారీల ద్వారా తరలిస్తున్నారు.

ఆమదాలవలస, నరసన్నపేటలోనూ దందా..

ఆమదాలవలస మండలం దూసి, తోటాడ, అక్కివరం, నిమ్మ తొర్లవాడ ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. నరసన్నపేట మండలంలో గోపాలపెంట, మడపం, బుచ్చిపేట, చేనులువలస, లుకలాం, వెంకటాపురం,గెడ్డవానిపేట గ్రామాల్లో రాత్రి సమయాల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు.ఒక్కొక్క ట్రాక్టర్ ఇసుకను రూ.5 వేల వరకు విక్రయిస్తున్నారు. విశాఖపట్నం తదితర ప్రాంతాలకు లారీల్లో అక్రమంగా తరలిస్తున్నారు. జలుమూరు మండలం అంధవరం, పర్లాం, కొమ్మనాపల్లి తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. లారీకి రూ.15వేల వరకు, ట్రాక్టర్‌కు రూ.5 వేలు చొప్పున వసూలు చేస్తున్నారు.

- మొదలైన ఇసుక దోపిడీ
- కూటమి ప్రభుత్వం వచ్చాక చెలరేగిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- నాగావళి, వంశధారలో యథేచ్ఛగా అనధికార తవ్వకాలు
- ట్రాక్టర్లు, లారీల ద్వారా అక్రమ తరలింపు
- ట్రాక్టర్‌కు రూ.5వేలు, లారీకి రూ.15 వేలు వరకు వసూలు
- ఒత్తిళ్లకు భయపడి వదిలేస్తున్న సిబ్బంది



కరజాడ నుంచి అక్రమ ఇసుకతో తరలి వెళ్తున్న లారీలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అధికారంలోకి వచ్చేశాం.. అనధికారికంగా ఇసుకను తవ్వేద్దాం.. ఇదీ కొందరు కూటమి నేతలు వ్యవహరిస్తున్న తీరు. ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. నాగావళి, వంశధార నదుల్లో ఇసుక దందా యథేచ్ఛగా సాగిపోతోంది. డబ్బు ఆకలితో ఉన్నట్టు టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. మళ్లీ పాత రోజులు గుర్తు చేస్తున్నారు. 2014–19 మధ్య ఏవిధంగానైతే ఇసుక దోపిడీ చేశారో అదే తరహాలో మళ్లీ అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా చేస్తూ రెచ్చిపోతున్నారు. ట్రాక్టర్ ఇసుకకు రూ.5వేలు, లారీ ఇసుకకు రూ.10వేల నుంచి రూ.15వేలు వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రం పరిసరాల్లోనే ఎక్కువగా ఇసుక దోపిడీ జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లో రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. జేసీబీలతో తవ్వేసి, లారీలు, ట్రాక్టర్లు ద్వారా అడ్డగోలుగా దందా సాగిస్తున్నారు. ఒక్క శ్రీకాకుళం మండలంలో టీడీపీ అధికారంలోకి వచ్చాక 40కి పైగా ఇసుక కేసులు నమోదయ్యాయంటే ఏ స్థాయిలో అక్రమ దందా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు.

అధికారం అండతో..

పసుపు బిళ్ల వేసుకుని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తే.. కూర్చోబెట్టి టీ ఇచ్చి మీరడిగిన పని చేస్తారని, చేయకపోతే ఏం చేస్తానో ఆ అధికారులకే తెలుసని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటికే చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులను నోటికొచ్చినట్టు మాట్లాడటం, దాడులు చేయడం చేస్తున్నారు. అదే ధీమానో మరేంటో తెలియదు గానీ టీడీపీ కూటమి గెలిచిందే తరువాయి ఇసుక, మట్టిపై ఆ పార్టీ శ్రేణులు పడ్డాయి. ప్రమాణస్వీకారం చేయక ముందే నదులపై పడి దోపిడీ ప్రారంభించారు. ఇప్పుడది పతాక స్థాయికి చేరుకుంది. అధికారులు తమను ఏమీ చేయలేరని, తమ జోలికొస్తే ఎలా ఉంటుందో తెలుసన్న ధీమాతో ఇసుక దందా సాగిస్తున్నారు. ఇప్పటికే ఇసుక, మట్టి ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించారు. ఇసుక కొత్త విధానం అమల్లోకి వచ్చే లోపే దొరికినంత దోచుకుని, అందిన కాడికి దండుకోవాలని చూస్తున్నారు.

చూసీ చూడనట్టు..

టీడీపీ నాయకులకు భయపడో...అధినేతల నుంచి వస్తున్న ఒత్తిళ్లో తెలియదు గాని సంబంధిత అధికారులు కూడా ఇసుక అక్రమ దందాను చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. సిఫార్సులు రాకపోతే పట్టుకున్న వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నారు. ఒత్తిళ్లు వస్తే అక్కడికక్కడే వదిలేస్తున్నారు. ఇప్పటికే శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలపై నిఘా వర్గాలు ఉన్నతాధికారులకు ప్రత్యేక నివేదిక ఇచ్చినట్టు సమాచారం. నిలువరించలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆ నివేదికలో పేర్కొనట్టు తెలిసింది. ఇదిలా ఉండగా, ఇసుక అక్రమ తవ్వకాలతో తమకు కూడా సొమ్ములు వస్తున్నాయన్న ఆశతో కొంతమంది పోలీసు సిబ్బంది కూడా ఆ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించేందుకు ఆసక్తి చూపిస్తున్నట్టు తెలిసింది. ఊరకనే డబ్బులొస్తున్నాయనే ఆ ప్రాంతాల్లో డ్యూటీ పడేలా అధికారులను రిక్వెస్టు చేస్తున్నట్టుగా వాదనలు విన్పిస్తున్నాయి.



భైరి వద్ద అక్రమ ఇసుక నిల్వలు



తోటపాలెం మీదుగా తరలి వెళ్తున్న ఇసుక ట్రక్కులు

న్యూస్‌రీల్

దేవదాయ భూముల రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

కొత్తూరు: మండలంలోని కర్లెమ్మ రెవెన్యూ గ్రూపులో సర్వే నంబర్ 201–2బీ, 202–5బీలో ఉన్న దేవదాయ శాఖ భూముల రికార్డులను టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ పరిశీలించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. భూముల రీ సర్వేలో పలు అక్రమాలు జరిగినట్లు సబ్ కలెక్టర్‌కు ఇటీవల కొందరు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రికార్డులు పరిశీలించి నివేదిక సిద్ధం చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.వి.ప్రసాదరావు, సర్వే డీటీ అనంతరావు, వీఆర్వో రాములు తదితరులు పాల్గొన్నారు.

5న సీజీఆర్‌ఎఫ్ వేదిక

అరసవల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) ఈ నెల 5న శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రోడ్డులోని నూతన ఎంఆర్‌టీ భవన్‌లో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు ఆపరేషన్స్ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్ వినియోగదారులు విద్యుత్ పరమైన సమస్యలను సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, సభ్యుల ముందు లిఖితపూర్వకంగా తెలియజేసి పరిష్కారాన్ని వెంటనే పొందవచ్చని పేర్కొన్నారు.

రైతులకు న్యాయం చేస్తాం



పొలాన్ని పరిశీలిస్తున్న ఏపీసీడ్స్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ, ఏవో శ్రీనివాసరావు

సాక్షి ఎఫెక్ట్...

కొత్తూరు: మండలంలోని కొత్తూరు, కర్లెమ్మ, మాతల, వసపతో పాటు పలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన 1061 వరి రకం విత్తనాలు మొలకెత్తని విషయమై 'సాక్షి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి వ్యవసాయ శాఖ స్పందించింది. స్థానిక ఏవో శ్రీనివాసరావు, ఏపీ సీడ్స్ ఫిర్యాదు మేరకు బుధవారం ఏపీసీడ్స్ జిల్లా మేనేజర్ బాలకృష్ణ, శాస్త్రవేత్త మధు, ఏవో శ్రీనివాసరావులు కొత్తూరులో మొలకెత్తని వరి విత్తనాల పొలాలను పరిశీలించారు. కొన్ని బ్యాగుల విత్తనాలు మాత్రమే మొలకెత్తలేదని చెప్పారు. బాధిత రైతులకు న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. పరిశీలనలో గ్రామ వ్యవసాయ సహాయకులు దివాకర్, వసంత పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలను పరిరక్షించాలి



ఉపాధ్యాయులతో కలిసి మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.సత్యనారాయణ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో ప్రభుత్వ బడులను ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలను పరిరక్షించేలా జీవో నెంబర్ 117ను వెంటనే రద్దు చేయాలని ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకట సత్యనారాయణ డిమాండ్ చేశారు. మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించిన పీఎఫ్ అకౌంట్ దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉందని.. దీనిని వెంటనే మంజూరు చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా పలు పాఠశాలలను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. సాయంత్రం శ్రీకాకుళంలో నిర్వహించిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతు మున్సిపల్ ఉపాధ్యాయులను మున్సిపల్ పరిధి పాఠశాలలకు మాత్రమే సర్దుబాటు చేయాలని కోరారు. గత ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలకు కొత్త శోభ తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆపస్ జిల్లాశాఖ అధ్యక్షుడు దుప్పల శివరామప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.సోమేశ్వరరావు, రాష్ట్రసంఘ ప్రతినిధులు తమ్మినేని ఆనందరావు, జిల్లా ఆర్థిక కార్యదర్శి చలపాక రమణ, ఉరిటి రామనాథరావు, అన్నెపు పున్నయ్య, మెట్ట రవిభట్లు, నరసింగరావు, కాశీవిశ్వనాథరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణతో ఉపాధి

శ్రీకాకుళం అర్బన్: హెవీ డ్రైవింగ్ శిక్షణతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్, డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరాజు అన్నారు. శ్రీకాకుళంలోని ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ 16వ బ్యాచ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీలో మాత్రమే హెవీ డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న వారు ప్రభుత్వ శాఖల్లో డ్రైవర్లుగా, ఆర్టీసీలో ఆన్ కాల్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని చెప్పారు. బ్యాచ్, ఫీజు ఇతర వివరాలకు 9963091999, 7382923293 నంబర్లను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఒకటో డిపో మేనేజర్ మల్లికార్జునరాజు

● రేపు శ్రీకాకుళంలో జాబ్‌మేళా

శ్రీకాకుళం బలగ ఆస్పత్రి జంక్షన్‌లోని డీఎల్‌టీసీ/ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 5న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి కొత్తలంక సుధ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కో లిమిటెడ్ సంస్థలో బ్రాంచ్ మేనేజర్, బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్/ఎగ్జిక్యూటివ్స్ పోస్టుల ఖాళీలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. 28 నుంచి 38 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన స్త్రీ/పురుష అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైనవారికి రూ.18 వేల నుంచి రూ.40 వేల మధ్య జీతంతోపాటు ఇతర అలవెన్సులు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైనవారు శ్రీకాకుళం, టెక్కలి, రాజాం, రణస్థలం, నరసన్నపేట ప్రాంతాల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు బయోడేటా, ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు.

– శ్రీకాకుళం న్యూకాలనీ

ఎచ్చెర్లలో పనిచేయలేం బాబోయ్!



- ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్ దూకుడుతో హడలెత్తిపోతున్న ఉద్యోగులు
- ఒత్తిళ్లు భరించలేక ఉద్యోగాలు చేయలేని దుస్థితి
- మనస్థాపానికి గురై ఒకరు ఉద్యోగానికి రాజీనామా
- దీర్ఘకాలిక సెలవులోకి వెళ్లిపోయిన ఎంపీడీఓ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే నడికుదిటి ఈశ్వరరావు ఉద్యోగులను హడలెత్తిస్తున్నారు. తన చెప్పు చేతుల్లోకి తీసుకోవాలనో.. తాను చెప్పినట్టే నడుచుకోవాలనో.. దూకుడు ప్రదర్శిస్తుండటంతో ఉద్యోగులు బెంబేలెత్తిపోతున్నారు. ఒత్తిళ్లు తట్టుకోలేక ఉద్యోగాలు సైతం వదులుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే రణస్థలం బీర్ల ఫ్యాక్టరీ విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు.. ఇప్పుడు ఉద్యోగుల విషయంలో వివాదాస్పదమయ్యారు.

దీర్ఘకాలిక సెలవులోకి ఎచ్చెర్ల ఎంపీడీఓ..

ఇటీవల రణస్థలం మండలంలోని బీర్ల ఫ్యాక్టరీ విషయంలో ఏం జరిగిందో అక్కడి వారందరికీ తెలిసిందే. తన కనుసైగల్లో ఫ్యాక్టరీ నడవాలని, తాను చెప్పినట్టుగా నడుచుకోవాలని.. కప్పం కడితేనే ఫ్యాక్టరీ నడుస్తుందనే కోణంలో పరోక్ష హెచ్చరికలు చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇప్పుడా వివాదం చల్లారక ముందే ఉద్యోగుల వ్యవహారం తెరపైకి వచ్చింది. ముఖ్యంగా ఎచ్చెర్ల మండలంలో కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు ఉద్యోగులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ప్రతీ దాంట్లో ఎమ్మెల్యే ఎన్‌ఈఆర్ జోక్యం చేసుకోవడంతో ఉద్యోగం చేయలేని పరిస్థితిలోకి సిబ్బంది వెళ్లిపోయారు. గత నెల 27న ఎమ్మెల్యే ఈశ్వరరావు ఆకస్మిక తనిఖీ, సమీక్ష తర్వాత ఇద్దరు టీడీపీ నాయకులు ఎంపీడీఓ రమాదేవిని బెదిరించారు. ఫరీదుపేట టీడీపీ నాయకుడు కొత్తకోట అమ్మినాయుడు, కొయ్యాం సర్పంచ్ జీరు వెంకటమ్మ భర్త రామారావు అసభ్య పదజాలంతో ఆమెను దూషించారు. ఈ నెల ఒకటో తేదీన కూడా టీడీపీ నాయకులు హెచ్చరికలు చేశారు. వీరిలో ఒకరు ఒక సందర్భంలో 'నీకు బట్టలు విప్పి ఊడదీసి తంతాను' అంటూ బెదిరింపులకు కూడా దిగారు. దీంతో ఎంపీడీవో రమాదేవి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఉద్యోగ సంఘాలు కూడా ఈ విషయమై రోడ్డెక్కాయి. టీడీపీ నాయకుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. వారు చేసిన దూషణలు, బెదిరింపులకు తట్టుకోలేక చివరికి ఆమె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఈ సమయంలో ఎమ్మెల్యే ఈశ్వరరావు రంగంలోకి దిగి, ఎంపీడీవోను తన వద్దకు పిలిపించి రాజీ చేసుకుని కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడితో కూడిన హెచ్చరిక చేశారు. దీంతో తప్పని పరిస్థితుల్లో ఆమె కేసు ఉపసంహరించుకున్నారు. ఊరడింపుగా ఆ ఇద్దరు టీడీపీ నాయకుల చేత సదరు ఎంపీడీవోకు క్షమాపణలు చెప్పించారు. ఇలాంటి అవమానకర పరిస్థితుల్లో పనిచేయలేమని ఆమె ఏకంగా దీర్ఘకాలిక సెలవు పెట్టేశారు. లిఖిత పూర్వకంగా జిల్లా పరిషత్‌కు సమాచారమిచ్చారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ఎంపీడీవోగా అక్కడ పనిచేస్తున్న ఏఓ రామ్మోహన్‌ను నియమించడం కూడా జరిగిపోయింది.

సాగునీటి బోర్ల విషయంలో మరొకరు బలి

ఎచ్చెర్ల మండలంలోని పూడివలస గ్రామంలో ప్రభుత్వ బోరు బావులకు ప్రైవేటు వ్యక్తులు మోటార్లు పెట్టి వ్యక్తిగత అవసరాలకు వినియోగించుకుంటున్నారని ఇటీవల పబ్లిక్ గ్రీవెన్‌సెల్‌కు ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని వ్యక్తిగత అవసరాలకుకు వినియోగిస్తున్న ప్రభుత్వ బోర్లకు, బావులకు ఉన్న మీటర్లు తొలగించాలని ఆదేశించారు. అక్కడ ఆరు బోర్లు ఉండగా, వాటిని తొలగించేందుకు గ్రామ కార్యదర్శి సనపల సీతారామరాజు ఉపక్రమించారు. ఈ సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులకు సంబంధించి బోర్లు మాత్రమే తొలగించాలని, టీడీపీ నాయకులకు చెందిన బోర్లు తొలగించొద్దని ఎమ్మెల్యే ఈశ్వరరావు నుంచి ఒత్తిళ్లు వచ్చాయి. పక్కనున్న మరో అధికార పార్టీ ఎమ్మెల్యే నుంచి కూడా ఇదే రకమైన ఒత్తిడి వచ్చింది. పరిస్థితులు ఇలా ఉన్నాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన స్పందన రాలేదు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని, మరోవైపు ఎమ్మెల్యేల నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని గ్రామ కార్యదర్శి సీతారామరాజు మనస్థాపానికి గురయ్యారు. మరో ప్రాంతానికి వెళ్దామంటే పరిస్థితులు కూడా అనుకూలించలేదు. దీంతో ఉద్యోగాన్నే వదులు కోవడానికి సిద్ధమయ్యారు. ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా తన ఉద్యోగానికి రాజీనామా చేసేశారు. ఈ మేరకు రాజీనామా లేఖను జిల్లా పంచాయతీ అధికారి, ఎంపీడీవోకు అందజేశారు. ఇదే సమయంలో తనకు ఎటువంటి పరిస్థితులు ఎదురయ్యాయో తెలియదు గానీ ఈఓపీఆర్‌డీ కణితి ఈశ్వరి కూడా వీఆర్‌ఎస్ పెట్టేశారు. ప్రస్తుతం ఆమె దీర్ఘకాలిక సెలవులో ఉండి వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆమె స్థానంలో ఎస్‌ఎంపురం గ్రామ కార్యదర్శి వి.బి.దేవికి ఈఓపీఆర్‌డీ బాధ్యతలు అదనంగా అప్పగించారు. ఉద్యోగులపై వేధింపులు రోజురోజుకూ పెరుగుతుండటంతో మరికొందరు కూడా సెలవుపై వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

● కౌలు రైతుల హక్కులపై అవగాహన

కౌలు రైతుల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయశాఖాధికారి కె.శ్రీధర్ అన్నారు. బూర్జ మండలం పాలవలస గ్రామ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో బుధవారం కౌలు రైతులు, భూయజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం ప్రమాణ పథకం కింద భూ సంరక్షణ, మట్టి పరీక్షల ఆవశ్యకత, సూక్ష్మపోషకాల లభ్యతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం రైతులకు యూరియా, డీఏపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బొడ్డేపల్లి రాజగోపాలరావు, తహసీల్దార్ ఎస్.వి.అంబేడ్కర్, మండల వ్యవసాయాధికారి వి.రాజేశ్వరరావు, వీఆర్వో రమణమ్మ, వీఏఏలు హేమలత, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, గ్రామపెద్దలు జల్లు పోలినాయుడు, పాలవలస నారాయణ మూర్తి, నిలురౌతు రామకృష్ణ, జల్లు అప్పల స్వామినాయుడు, కర్నేన నాగేశ్వరరావు పాల్గొన్నారు. –బూర్జ



మాట్లాడుతున్న వ్యవసాయశాఖ జేడీ శ్రీధర్

● వైభవంగా కూర్మనాథుని జయంతోత్సవం



బేడా మండపంలో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

మండలంలోని శ్రీకూర్మంలో కూర్మనాథుని జయంతోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఏటా జ్యేష్ఠ శుద్ధ బహుళ ద్వాదశి నాడు నిర్వహించే ఈ పూజల్లో భాగంగా ముందుగా మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. బాలభోగం అనంతరం స్నపన తిరుమంజనం సేవ నిర్వహించి ప్రధాన కలశంతో దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఉత్సవమూర్తిని బేడా మండపంలో ఉంచి ప్రధానార్చకులు చామర్తి సీతారామన్న సింహాచార్యులు ఆధ్వర్యంలో రుత్విక్కులు వసంత కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి శీతల నైవేద్యం సమర్పించారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి అనివెటి మండపంలో వేంచింపజేసి ధర్మకర్త గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆస్థాన మండపంలో వివిధ తీర్థ జలాలు, క్షీరాభిషేకం, కుంకుమలతో అభిషేకం చేశారు. ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలంకరణ చేసి కూర్మనాథుని ఆవిర్భావ చరిత్రను వివరించారు. అనంతరం మంగళాశాసనం, ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.గురునాథం, అర్చకులు దాసుబాబు, పద్మనాభాచార్యులు, కిషోర్‌బాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – గార

● కుక్కల దాడిలో దుప్పికి గాయాలు

మందస మండల పరిధిలో రిజర్వు ఫారెస్టు వద్ద దారి తప్పి జనావాసాలలోకి వచ్చిన దుప్పిని వీధికుక్కలు చుట్టుముట్టి దాడి చేశాయి. ఈ సమయంలో ఓ ఇంట్లోకి చొరబడిన దుప్పిని స్థానికులు కాపాడారు. అప్పటికే కుక్కల దాడిలో తీవ్ర గాయాలు కావడంతో అటవీ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి దుప్పికి సపర్యలు చేసి అనంతరం అడవిలో విడిచిపెట్టారు. – కాశీబుగ్గ



గాయపడిన దుప్పి

క్లుప్తంగా

పరిశ్రమలో గాయపడిన కార్మికుడు మృతి

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం పారిశ్రామికవాడలో శ్రేయాస్ పరిశ్రమలో మంగళవారం సాయంత్రం ఉప్పు నిల్వ చేసే గోదాం పైన పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారిపడి షమీమ్ షేక్‌తో పాటు కార్మికుడు రకిబుల్ షేక్(23) అనే కార్మికుడు పడిపోయాడని జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో షమీమ్ షేక్ మంగళవారమే మృతి చెందగా.. రకిబుల్ షేక్ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. ఇద్దరూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నదియా జిల్లా భౌరు గ్రామానికి చెందినవారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జె.ఆర్.పురం ఎస్సై కె.గోవిందరావు తెలిపారు. విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రిలో శవపంచనామా పూర్తిచేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మోహన్‌దాస్‌కు సత్కారం



సత్కారం అందుకుంటున్న ఎస్‌బీఐ మేనేజర్ మోహన్‌దాస్

పాతపట్నం: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 69వ ఆవిర్భావ వేడుకలు ఇటీవల ముంబైలో ఘనంగా జరిగాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి పాతపట్నం ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ పెద్దింటి మోహన్‌దాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశంలో 17 సర్కిల్స్ నుంచి 24మంది మేనేజర్లు బ్యాంక్ డే వేడుకల్లో పాల్గొన్నారని, అందులో మన రాష్ట్రం నుంచి తాను హాజరైనట్లు తెలిపారు. అక్కడి ఉన్నతాధికారులు అభినందించి సత్కరించారని చెప్పారు. అనంతరం మోహన్‌దాస్‌ను స్థానిక సిబ్బంది అభినందించారు.

జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలని వినతి


రైల్వేమంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ అప్పలనాయుడు

రణస్థలం: కోవిడ్ సమయంలో జర్నలిస్టులకు రద్దు చేసిన రైల్వే రాయితీ పాసులను పునరుద్ధరించాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో బుధవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం అందజేశారు.

మట్టి ట్రాక్టర్ల సీజ్


తహశీల్దారు కార్యాలయం వద్ద ట్రాక్టర్లు


కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 3వ వార్డు జయ రామచంద్రపురంలో బుధవారం అక్రమంగా మట్టితవ్వకాలు జరుపుతున్న మూడు ట్రాక్టర్లను అధికారులు సీజ్ చేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా రియల్ వెంచర్లకు వందల సంఖ్యలో మట్టి లోడ్లను ట్రాక్టర్‌లతో తరలించడంతో రెవెన్యూ అధికారులకు సమాచారం చేరింది. వెంటనే పలాస తహశీల్దారు ఎస్ఎస్‌వీఎస్ నాయుడు ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ ఘటనా స్థలానికి చేరుకుని ట్రాక్టర్లను సీజ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గమిదే

శ్రీకాకుళం అర్బన్: బీసీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని శ్రీకాకుళంలోని ఎన్‌జీవో కార్యాలయంలో బుధవారం ఎన్జీవో ప్రతినిధుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఓ.గురువులు, కార్యదర్శిగా బి.వైకుంఠరావు, కోశాధికారిగా పి.శివప్రసాద్, సహాధ్యక్షునిగా ఎస్.ఉపేంద్ర, ఆర్గనైజ్ సెక్రటరీగా ఆర్.మోహనరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.రామకృష్ణ, బి.మీనాక్షి, జాయింట్ సెక్రటరీలుగా జె.రమేష్ బాబు, ఓ.లక్ష్మణరావు ఎన్నికయ్యారు. ఎన్నికైన వారితో ఎన్జీవో సహాధ్యక్షుడు, ఎన్నికల అధికారి గోవింద పట్నాయక్, సహాయ ఎన్నికల అధికారి పూర్ణచంద్రరావు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో బీసీ హాస్టల్ వెల్ఫేర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడు పండు..
పోషకాలు మెండు


మార్కెట్‌లో అమ్మకానికి ఉంచిన నేరేడు పండ్లు

- ఆకు నుంచి బెరడు వరకు ఔషధ గుణాలు
- పండ్లకు మార్కెట్‌లో మంచి డిమాండ్
- సర్వరోగ నివారిణిగా ప్రసిద్ధి

వజ్రపుకొత్తూరు:

నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. కాస్త వగరు, పులుపు, తీపి, కలబోతగా ఉండే వీటిలో పోషకాలు పుష్కలం. రక్తాన్ని శుద్ధి చేయడంతో పాటు బీపీ, షుగర్, గుండె, కాలేయ సంబంధిత వ్యాధులు, సీజనల్ రోగాల నియంత్రణకు ఈ పండ్లు ఎంతగానో దోహదపడతాయి.

గ్రామాల్లో నేరేడు పండును సర్వరోగ నివారిణిగా భావిస్తారు. ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా నేరేడు పండ్లు పుష్కలంగా కనిపిస్తున్నాయి. సీజన్లో మాత్రమే దొరికే పండ్లలో ఈ పండ్లకు చాలా ప్రాధాన్యత ఉంది. సీజనల్ వ్యాధులకు గురికాకుండా రోగనిరోధక శక్తి పెంచడంలో ఇవి బాగా పని చేస్తాయి. వీటిలో విటమిన్లు, పోషకాలు అధికంగా ఉంటాయి.

ఆరోగ్యానికి మేలు..



నేరేడు పండ్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. శరీరంలో విష గుణాన్ని హరించే శక్తి వీటికి ఉంది. శస్త్రచికిత్సలు అందుబాటులో లేని రోజుల్లో వైద్యానికి నేరేడు బెరడు, కాయలు, ఆకులను ఎక్కువగా వినియోగించేవారు. మధుమేహం, రక్తహీనత, బీపీతో పాటు పలు దీర్ఘకాలిక వ్యాధులు నివారణకు ఇవి ఔషధాలుగా పని చేస్తాయి.

– డాక్టర్ కె.లీల, విశ్రాంత డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, టెక్కలి

హైబ్రిడ్ రకానికి గిరాకీ..

వర్షాకాలం ఆరంభం నుంచి నేరేడు పండ్లు సీజన్ మొదలవుతుంది. ప్రస్తుతం పట్టణాల్లో ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నాటు పండ్లు కంటే హైబ్రిడ్ (జంబో నేరేడు) రకానికి గిరాకీ ఎక్కువ. వీటి ధర కూడా ఎక్కువే. నాటు పండ్లు ప్రస్తుతం కిలో రూ.150 నుంచి రూ.170 వరకు ఉంటే హైబ్రిడ్ కిలో రూ. 200 నుంచి రూ.250 మధ్య విక్రయిస్తున్నారు. మధుమేహం, రక్త హీనత, బీపీ, కిడ్నీ సమస్యలతో పాటు అనేక దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమయ్యేవారు ఈ పండ్లను తింటే చాలా వరకు రోగాలను నియంత్రించుకోవచ్చునని నిపుణులు చెబుతున్నారు.

వీరికి వద్దు..

నేరేడు పండ్లు ఎక్కువగా తింటే బీపీ తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయి తగ్గుతుంది. శస్త్ర చికిత్స చేయించుకునే వారు వీటికి దూరంగా ఉండటమే మేలు. బీపీ సమస్య ఎక్కువగా ఉన్నవారు వీటిని ఎక్కువగా తినరాదు. ఖాళీ కడుపుతో నేరేడు పండ్లు అస్సలు తినరాదు. ఈ పండ్లను అధికంగా తింటే మొటిమలు వస్తాయి. చర్మసమస్యలు ఉన్నవారు తింటే అలర్జీలు పెరుగుతాయి.

ఉపయోగాలెన్నో..

- శరీర భాగాలకు గాయాలైతే నేరేడు ఆకులను కట్టుగా కడితే రక్తం కారకుండా నిలుపుదల చేయవచ్చు.
- మూత్రాశయ సమస్యలకు నేరేడు ఓ టానిక్‌లా పని చేస్తుంది. మూత్రం రాక ఇబ్బంది పడే వారికి ఇదొక దివ్యమైన ఔషధం.
- పొట్టలో ఉండే నులి పురుగులను నేరేడు నివారిస్తుంది.
- నోటి క్యాన్సర్ నివారణకు నేరేడు పండ్లు ఎంతగానో ఉపయోగపడతాయి.
- మధుమేహ బాధితులు నేరేడు గింజలను పొడిగా చేసుకుని రోజూ నీటిలో మరగబెట్టి, వడకట్టి తాగితే శరీరంలో చక్కెర నిల్వలు అదుపులో ఉంటాయి.
- నోటి పూత, చిగుళ్ల వ్యాధులు, దంతక్షయంతో బాధపడేవారు నేరేడు ఆకుల రసాన్ని పుక్కిలిస్తే ఉపశమనం కలుగుతుంది.
- నోటిపూత వచ్చినపుడు రెండు, మూడు నేరేడు పండ్లు తింటే వెంటనే మంట, బాధ నుంచి విముక్తి లభిస్తుంది.
- అతిసార రోగులకు సైతం ఈ పండ్లు ఔషధంలా పనిచేస్తాయి.

కన్నవారికి కడుపుకోత

- ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి
- గతేడాదే సోదరుడు ఆత్మహత్య
- పెద్ద తామరాపల్లిలో విషాదఛాయలు



కాలువలో పడిన ట్రాక్టర్ (ఇన్‌సెట్లో) వంశీ(ఫైల్)

టెక్కలి రూరల్ : గత ఏడాది పెద్ద కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆ బాధను మరిచిపోలేక కుమిలిపోతున్న ఆ తల్లిదండ్రులకు ఇప్పుడు చిన్న కుమారుడు కూడా దూరమయ్యాడు. ట్రాక్టర్ ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. నందిగాం మండలం పెద్దతామరాపల్లి గ్రామానికి చెందిన పోలాకి వంశీ(27) తన గ్రామం సమీపంలోని టెక్కలి మండలం కొండభీంపురం వద్ద బుధవారం ట్రాక్టర్‌తో పొలంలో మట్టిని తరలించే పనికి వెళ్లాడు. సమీపంలోని జాతీయ రహదారిపైకి ట్రాక్టర్‌ను ఎక్కించే క్రమంలో వంశధార పిల్లకాలువ దాటుతుండగా ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపు తప్పి ఇంజిన్ భాగం కాలువలో బోల్తాపడింది. ఈ ఘటనలో వంశీ ఇంజిన్ కింద ఇరుక్కుపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు, హైవే అంబులెన్స్ సిబ్బంది వంశీని బయటకు తీసి టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వంశీ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. టెక్కలి ఎస్‌ఐ–2 వి.వెంకటేశ్వరరావు వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం మృతదేహానికి శవపంచనామా నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడు పోలాకి తిరుపతిరావు, బుద్దమ్మ దంపతులకు రెండో కుమారుడు. గత ఏడాది పెద్దకుమారుడు మధు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ బాధ మరువక ముందే రెండో కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించడం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

అక్రమ లే అవుట్ తొలగింపు


చినబడాంలో అక్రమ లేఅవుట్‌ను తొలగించిన మున్సిపల్ అధికారులు

కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో అక్రమ రియల్ ఎస్టేట్ వెంచర్లపై అధికారులు చర్యలు చేపడుతున్నారు. మున్సిపాలిటీ, రెవెన్యూ శాఖ అనుమతులు లేకుండా వేసిన వెంచర్లను గుర్తిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 7వ వార్డు చినబడాం, గోపాలపురం గ్రామాల మధ్య పంట భూములలో వేసిన లేఅవుట్‌ను అధికారులు పరిశీలించారు. పాత జాతీయ రహదారికి అనుకుని నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు గుర్తించి మున్సిపల్ జేసీబీతో బీటీ రోడ్లు, కంచె స్తంభాలు, డివైడర్లను తొలగించారు. సర్వే నంబర్ 71/03 లో సుమారు రెండు ఎకరాల అరవై సెంట్ల స్థలంలో ఈ లే అవుట్‌ను వేసినట్లు గుర్తించారు. ఆర్డీఓ భరత్ నాయక్ ఆదేశాలతో పలాస తహశీల్దారు ఎస్ఎస్‌వీఎస్ నాయుడు ఈ మేరకు చర్యలు చేపట్టారు. దాడుల్లో టీపీఓ అప్పలస్వామి, సిబ్బంది ప్రేమ్‌చంద్, గుప్తా, శ్రీనివాసరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

ఏపీఎల్‌లో మకరాంపురం క్రీడాకారుడి ప్రతిభ


అవార్డు అందుకుంటున్న బెందాళం సాత్విక్

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామానికి చెందిన క్రికెటర్ బెందాళం సాత్విక్ ఆంధ్రప్రదేశ్ ప్రీమియర్ లీగ్(ఏపీఎల్- 2024)లో సత్తాచాటాడు. విశాఖ స్టేడియంలో జరుగుతున్న ఈ పోటీల్లో భాగంగా మంగళవారం ఉత్తరాంధ్ర లయన్స్, గోదావరి టైటాన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో లయన్స్ తరఫున బరిలో దిగి ఛేదనలో 26 బంతుల్లో 38 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఏపీఎల్ గేమ్ ఛేంజర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డుతో పాటు రూ.10వేలు నగదు బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు హేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్

ఇచ్ఛాపురం రూరల్: అధికారంలోకి వచ్చి నెల తిరక్కముందే వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులు చేయడం హేయమైన చర్య అని ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్ అన్నారు. బుధవారం ఇచ్ఛాపురం ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీకార్యాలయాలు, ప్రభుత్వ భవనాలపై దాడులు, యూనివర్సిటీలో వీసీలను బెదిరించడం వంటి విష సంస్కృతిని టీడీపీ నేతలు విడనాడాలన్నారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో టీడీపీ శ్రేణులపై ఎటువంటి దాడులు తమ పార్టీవారు చేయకుండా, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ఇటీవల పింఛన్ల పంపిణీలో వైఎస్సార్ సీపీ సానుభూతిపరులకు పింఛన్లు ఇవ్వకుండా టీడీపీ నాయకులు అడ్డుకోవడం సరికాదన్నారు. పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, ఆయన సోదరుడు ఆనందరావులను 24వ వార్డు కౌన్సిలర్ కుమారుడు, టీడీపీ పట్టణ కార్యదర్శి సప్ప పవీన్ అగౌరపరుస్తూ కబంధ భస్తాల్లో బంధించడం చూస్తుంటే ప్రస్తుత ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీ శ్రేణులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా దాడులు ఆపి రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు.

సమావేశంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ నర్తు ప్రసాదరావు యాదవ్ పాల్గొన్నారు.

హైస్కూళ్లలో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ఐక్య ఫెడరేషన్(యు.టి.ఎఫ్) జిల్లా శాఖ ప్రతినిధులు బుధవారం డీఈఓ వెంకటేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. చాలా వరకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరత ఉందని.. టీచర్లు లేనిచోట విద్యా వలంటీర్లను నియమించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్, సర్వీస్ రెగ్యులరైజేషన్, పాస్‌పోర్ట్ ఎన్‌ఓసీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని విన్నవించారు. పాఠ్యపుస్తకాలు ఇంకా చాలా వరకు రావాల్సి ఉందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న స్టూడెంట్ కిట్లను పాఠశాల పాయింట్ వద్దకు సరఫరా చేయాలని, పూర్తిస్థాయిలో వస్తువులు రాలేదని డీఈవో దృష్టికి తీసుకెళ్లారు.

యూడైస్ లోపాలు సరిచేయాలి..

యూడైస్‌లో నెలకొన్న వివిధ సాంకేతిక లోపాలను సవరించాలని, పలువురు విద్యార్థులు పాఠశాలల్లో చేరే సందర్భాల్లో పూర్వపు పాఠశాల్లో.. వారి పేరును ఆన్‌లైన్‌లో వెంటనే తొలగించే ఏర్పాట్లు చేయాలని యూటీఎఫ్ నాయకులు విన్నవించారు. ముఖ్యంగా ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయ, ఉద్యోగ సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్‌లు మంజూరు చేయాలన్నారు. బడుల్లో ఆన్‌లైన్ వర్క్‌లు చేసేందుకు ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని విన్నవించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, జి.సురేష్, జిల్లా నాయకులు ఎల్.కోదండరామయ్య, ఆర్.త్రినాధరావు, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


సారా తయారీ సామగ్రిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని చీడిపాలెంలో డీటీఎఫ్, ఎస్ఈబీ, ఇంటెలిజెన్స్ బృందాలు పోలీసులు సమన్వయంతో సారాతయారీ స్థావరాలపై బుధవారం దాడులునిర్వహించారు. 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నిషేధిత మద్యం తయారీ, క్రయ విక్రయాలు నేరమని, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కలిగించారు. దాడుల్లో టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర్ నాయుడు, పాతపట్నం సీఐ సాయి, పలాస డీటీఎఫ్ సీఐ రామచంద్రకుమార్, ఇంటెలిజెన్స్ సీఐ కూర్మారావు, టెక్కలి ఎస్ఈబీ ఎస్సై గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలో పుస్తకాల గది సీజ్

కోటబొమ్మాళి: మండలంలోని చీపుర్లపాడు పంచాయతీ పరిధిలోని ఆదిత్యా ప్రైవేటు హైస్కూల్‌లో అధిక ధరలకు విద్యార్థులకు నోట్ పుస్తకాలు అమ్ముతున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు డి.చందు బుధవారం కోటబొమ్మాళి విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎంఈఓ ఎస్.అప్పలరాజుకు సంబంధిత స్కూల్‌కు వెళ్లి పుస్తకాలు నిల్వ చేసిన గదిని సీజ్ చేశారు. పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు చేపడతామని తెలిపారు.

క్రీడాకారుడి మృతికి కొవ్వొత్తులతో నివాళి


కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న సంఘ ప్రతినిధులు, క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రముఖ బ్యాడ్మింటన్ కీడాకారుడు జాంగ్ జిజీ(చైనా).. ఇండోనేషియాలో జరుగుతున్న జూనియర్ బాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో ఆడుతూ స్టేడియంలోనే కుప్పకూలుతూ అకాలమరణం చెందడం దిగ్భ్రాంతికి గురిచేసిందని రిజిస్టర్డ్ బాడ్మింటన్ సంఘ జిల్లా చైర్మన్ నటుకుల మోహన్ అన్నారు. బుధవారం శ్రీకాకుళంలోని శాంతినగర్‌కాలనీలో డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ప్రముఖ వైద్యులు బోడ్డేపల్లి సురేష్‌తోపాటు సంఘ ప్రతినిధులు, క్రీడాకారులు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు నక్క రామకృష్ణ, ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జి కె.ఢిల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు గణపతిరావు, కోశాధికారి గండేపల్లి జగన్నాథరావు, కార్యవర్గ సభ్యులు నల్లబారిక శ్రీనివాసరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సోంపేట: మండలంలోని ఎం.జి.పురం పంచాయతీ బాతుపురం వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకుని బుధవారం మృతి చెందినట్లు బారువ ఎస్‌ఐ చంద్రశేఖరరావు తెలిపారు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.

సామాన్యుడి ఇంటిపై కక్ష సాధింపు!

- అధికారులపై ఒత్తిడి తెస్తున్న టీడీపీ నేతలు
- నిర్మాణాలకు అడుగడుగునా అడ్డంకులు


నిర్మాణంలో ఉన్న ఇల్లు


ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఎస్ఎంపురంలోని 112 సర్వే నంబర్‌లో గతంలో అనేక మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. చాలా మంది ఇళ్లు సైతం నిర్మించుకున్నారు. ఎస్ఎంపురం ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయానికి 1985లో సర్వే నంబర్ 112లో 635/2లో 40 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. అయితే స్థలం మాత్రం గురుకుల విద్యాలయానికి అప్పగించ లేదు. సరిహద్దుల్లో ప్రహరీ, కంచె వంటి నిర్మాణాలు సైతం చేపట్టలేదు. 1994లో 60 మంది పేదలు, తప్పెటగుళ్ల కళాకారులకు రెండున్నర సెంట్లు చొప్పున పట్టాలు ఇచ్చారు. సర్వే నంబర్ 112/పి, బ్లాక్ నంబర్ 0-02, పాట్ నంబర్ 3 పట్టాను ముద్దాడ వెంకన్న అనే వ్యక్తికి ఇచ్చారు. ఈ స్థలంలో ఇప్పటి వరకు 30 మంది వరకు ఇళ్లు కట్టుకున్నారు. ఇందులో భాగంగా ముద్దాడ వెంకన్న తనకు కేటాయించిన స్థలంలో ఫిబ్రవరిలో ఇంటి నిర్మాణం ప్రారంభించారు. దీంతో కొందరు నాయకులు తెలివిగా ఎస్ఎంపురం గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్‌తో గురుకుల సంస్థకు ప్రభుత్వం కేటాయించిన స్థలం హద్దులు కేటాయించాలని, అక్రమ కట్టడాలు కడుతున్నారని, ముద్దాడ వెంకన్న అక్రమంగా కడుతున్నాడని ఫిబ్రవరి 19న పోలీస్ స్టేషన్, రెవెన్యూ, గ్రామ సచివాలయం అధికారులకు ఫిర్యాదు చేయించారు. అప్పటి నుంచి నిర్మాణానికి అడ్డుతగులుతూ వస్తున్నారు. ఇంతలో ప్రభుత్వం మారటంతో కొందరు టీడీపీ నాయకులు వ్యక్తిగతంగా కక్ష కట్టారు. నిర్మాణం తొలగించాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఫారం -6 నోటీస్ నిర్మాణం యజమానికి ఇచ్చి పనులు అడ్డుకొన్నారు. సదరు వ్యక్తి సామాన్యుడు కావటంతో అధికారులు సైతం అధికార పార్టీ నాయకులకే ఒత్తాసు పలుకు తున్నారు. ఇప్పటి వరకు జరిగిన 30 ఇళ్ల నిర్మాణాలపై ఫిర్యాదు లేదని అంటున్నారు తప్ప గురుకులానికి నిజంగా కేటాయించిన 40 ఎకరాల్లో ఉన్న నిర్మాణాలు గురించి గాని, సర్వే నంబర్ బైఫర్‌కేషన్ గురించి గాని మాట్లాడటం లేదని బాధితుడు వాపోతున్నాడు.

నోటీసులు ఇచ్చాం

ఇంటి నిర్మాణం చేపడుతున్న ముద్దాడ వెంకన్నకు నోటీసు ఇచ్చాం. ఫారం-7 నోటీస్ తిరస్కరించారు. దీంతో ఫారం -6 గత నెల 22న ఇచ్చాం. ప్రస్తుతం ఉన్న ఇళ్లు ఎప్పుడో నిర్మించినవి. ప్రస్తుత జరుగుతున్న నిర్మాణంపై మాత్రమే ఫిర్యాదు వచ్చింది. సంజాయిషీ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

– శ్యాంకుమార్, ఎచ్చెర్ల తహశీల్దార్

నాపై కక్షతోనే..



1994లో నాకు రెండున్నర సెంట్ల స్థలం ఇచ్చారు. అప్పట్లో 60 మందికి ఇచ్చారు. చాలా మంది ఇళ్లు నిర్మించుకున్నారు. నా వద్ద డబ్బులు లేకపోవటం అప్పట్లో కట్టలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంటి నిర్మాణం ప్రారంభించాను. ఎవ్వరికీ లేని ఇబ్బంది నాకు సృష్టిస్తున్నారు. అధికారులే న్యాయం చేయాలి.

– ముద్దాడ వెంకన్న, ఎస్ఎంపురం